రోగులకు సేవ... సాహితీ తోవ

- విభిన్న రంగాల్లో డాక్టర్ దక్షిణామూర్తి ప్రజ్ఞ
- తక్కువ ఖర్చుతో వైద్యం చేస్తూ మన్ననలు
- వైద్యవిజ్ఞానం, సాహిత్యం, సినిమాలపై రచనలు
- రేపు పరుచూరి రాజారామ్ సాహితీ పురస్కారం ప్రదానం

ఆయన వృత్తి వైద్యం. ప్రవృత్తి రచన. ఎనభై అయిదేళ్ల వయసులోనూ సవ్యసాచిలా వైద్యం, వైద్యవిజ్ఞానం, సాహిత్యం, సినిమా రచనలతో నిత్యం బిజీ జీవితం ఆయన సొంతం. తల్లిదండ్రులు పెట్టిన పేరు దక్షిణామూర్తి. తెలిసినవారంతా 'దాక్షిణ్యామూర్తి' అంటారు. ఇంటికి పెట్టిన పేరు 'సహృదయ', ఆయనకు సార్థక నామధేయం అనిపిస్తుంది. తెనాలి, పరిసరాల్లోని ప్రజలకు పేదల డాక్టరుగా సుపరిచితుడాయన. బహుముఖ రంగాల్లో సేవలకు గుర్తింపుగా 'అరసం' రాష్ట్ర నేత, పాపులర్ సైన్స్ రచయిత డాక్టర్ పరుచూరి రాజారామ్ సాహితీ పురస్కారాన్ని ఈనెల 18న డాక్టర్ దక్షిణామూర్తికి ప్రదానం చేయనున్నారు. ఆ రోజు సాయంత్రం ఆరు గంటలకు గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని గుంటూరు జిల్లా సీనియర్ సిటిజన్ సర్వీస్ ఆర్గనైజేషన్‌లో జరిగే డాక్టర్ రాజారామ్ 85వ జయంతి సభలో ఈ పురస్కారం అందించనున్నారు.

తెనాలి: వైద్యవృత్తిలో సొంత లాభం మానుకుని రోగుల స్వస్థత లక్ష్యంగా పనిచేస్తున్నారు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి. 1939 సెప్టెంబర్ 2న కృష్ణాజిల్లా గుంటుపల్లిలో జన్మించారు. ఎంబీబీఎస్, ఎండీ చేశాక ప్రభుత్వ సర్వీసులో ఎనిమిదేళ్లు పనిచేశారు. 1973లో తెనాలిలో సొంతంగా ప్రాక్టీస్ ప్రారంభించారు. అప్పట్లో తెనాలిలో ఆయనే తొలి ఎండీ (ఫిజిషియన్). 1979లో గుండె జబ్బులకు ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (కార్డియాక్ మానిటర్, డీఫిబ్రిలేటర్) ప్రారంభించారు. వైద్యవృత్తిలో మానవత్వంతో వ్యవహరిస్తుంటారనే పేరుతెచ్చుకున్నారు. అత్యవసర వైద్యం కోసం తీసుకొచ్చిన రోగికి క్షణం కూడా వృథా చేయకుండా వైద్యం అందిస్తారు. అటూ ఇటూ అయితే తిరిగివస్తాయా? లేదా? అనేది ఆలోచించకుండా మందులు, ఇంజక్షన్లు వాడేస్తారు. ఖరీదయిన మందులు రాస్తేనే రోగుల దృష్టిలో మంచి డాక్టరుగా చలామణి అవుతారనే భావన కలిగిన రోజుల్లో అతి చౌకైన మందులతోనే చికిత్స చేస్తున్నారు.


డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి

తనకు తెలిసిన వైద్యవిజ్ఞానాన్ని పదిమందికీ పంచాలన్న భావనతో డాక్టర్ దక్షిణామూర్తి పలు వైద్యవిజ్ఞాన వ్యాసాలను రాశారు. పుస్తకాలను రచించారు. ప్రభుత్వ సర్వీసులో ఉండగా 1978లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జాతీయస్థాయిలో నిర్వహించిన పోటీలో 'గ్రామీణ ప్రాంతాల్లో గుండెపోటుకు చికిత్స'పై రాసిన వ్యాసానికి 'ధీరేంద్రనాథ్ దత్తా' అవార్డును అందుకోవటం ఇందుకు ప్రేరణ. ఆ క్రమంలో ఆయన కలం నుంచి 'డాక్టరు గారి డైరీ', 'వైద్యవిజ్ఞానం', 'డయాబెటీస్ గైడ్', 'గుండెజబ్బులు–నివారణ', 'అధిక రక్తపోటు' పుస్తకాలు వచ్చాయి. ఇందులో డయాబెటీస్‌పై తొలిసారిగా వచ్చిన వీరి 'డయాబెటీస్ గైడ్' ఏడుసార్లు పునర్ముద్రణ పొందింది. 1981లో తెనాలిలో డయాబెటీస్‌పై సమగ్ర సర్వే చేసి జాతీయ సదస్సులో పత్రసమర్పణ చేశారు. అసోసియేషన్ ఆఫ్ ఫిజిషియన్స్, ఏపీ చాప్టర్‌కు అధ్యక్షునిగా చేశారు. 2009లో గుండెజబ్బులపై చేసిన సర్వే, ఫిజిషియన్స్ జర్నల్‌లో ప్రచురితమైంది. వ్యాధుల నివారణకు కొన్ని వందల వ్యాసాలను పత్రికలకు రాశారు.

చిన్నతనం నుంచే...

సినీరంగ ప్రముఖులతో బంధుత్వం కలిగిన డాక్టర్ దక్షిణామూర్తికి చిన్నతనం నుంచే ఆ రంగంపై ఆసక్తి పెరిగింది. సినిమా మంచీచెడులను విశ్లేషిస్తూ వ్యాసాలు రచించారు. క్లాసికల్ ఫిలిం సొసైటీ, చైతన్య వేదికను స్థాపించి పెద్దల సహకారంతో ఉత్తమ చిత్రాలను ప్రోత్సహించారు. ఉత్తమ దర్శకులు, రచయితలయిన బీఎన్ రెడ్డి, శ్రీశ్రీ, కొ.కు, ఆరుద్ర, దాశరథి, కె.విశ్వనాథ్, సి.నారాయణరెడ్డి, భానుమతి వంటి ప్రముఖులను సత్కరించారు. 'తెలుగులో ఉత్తమ చిత్రాలు', 'కళాత్మక దర్శకుడు బి.ఎన్.రెడ్డి', 'గూడవల్లి రామబ్రహ్మం' పుస్తకాలను రచించారు.

నివారణకు 'నడక' మార్గం..

వ్యాధుల చికిత్సే కాకుండా నివారణ మార్గాలను సూచించడం డాక్టర్ దక్షిణామూర్తి ప్రత్యేకత. నడక ఆవశ్యకతను ప్రచార బాధ్యతగా తలకెత్తుకున్నారు. 2000లో వాకర్స్ క్లబ్‌ను స్థాపించారు. నెలవారీ సమావేశాల్లో వైద్యవిజ్ఞాన ప్రసంగాలు, ఏటా వార్షికోత్సవంలో ఉత్తమ వాకర్స్‌ను సత్కరిస్తున్నారు. ఇటీవలే ఆ సంస్థ రజతోత్సవాలను ఘనంగా నిర్వహించారు. వైద్యుడిగా రోగుల చికిత్సతోనే సరిపెట్టకుండా బహుముఖ రూపాల్లో సమాజానికి తోడ్పడుతున్నారు. ఆ క్రమంలో పలు అవార్డులనూ అందుకున్నారు.

క్లుప్తంగా

దేవాలయంలో పరిశుభ్రతా పనులు



తెనాలి టౌన్: శ్రీ ఆంజనేయం ధ్యాన యోగ మండలి నిర్వాహకులు కిషోర్ గురూజీ ఆధ్వర్యంలో చినరావూరులోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయాన్ని ఆదివారం శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు పట్టణంలోని 122 దేవస్థానాలను శుభ్రం చేయడం జరిగిందన్నారు. అనంతరం ఆవరణలో మొక్కలు నాటి ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈవో హరిప్రసాద్, ప్రధాన అర్చకులు కృష్ణామాచార్యులు, యోగ మండలి సభ్యులు అక్షర, లత, రాణి, తాడికొండ శ్రీనివాసరావు, ముంతా శ్రీనివాసరావు, నాగరాజు, పలువురు యోగసాధకులు పాల్గొన్నారు.

కార్మికులకు దుస్తులు పంపిణీ



తెనాలిటౌన్: మారీసుపేటలోని 22వ వార్డులో ఆదివారం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. దివంగత మున్సిపల్ కౌన్సిలర్ షేక్ ఫాతిమా వర్ధంతిని పురస్కరించుకుని ఆమె కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అర్బన్ బ్యాంక్ చైర్మన్ మంగమూరి హరిబాబు మాట్లాడుతూ.. ఫాతిమా పేరిట 10 సంవత్సరాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో షేక్ సుభాని, రావి చిన్ని, ఈదర పూర్ణచంద్, శ్రీనివాస్, ఎస్.నాగేశ్వరరావు, కేసన కోటేశ్వరరావు, కన్నెగంటి మురళీ, వుయ్యూరు రాజశేఖరరెడ్డి, ఆలపాటి వెంకట్రామయ్య, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

భోజనం ప్యాకెట్లు పంపిణీ



తెనాలి అర్బన్: పట్టణంలోని పేదలు, యాచకులకు ఆదివారం భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఫర్ ది లీస్ట్ ఆఫ్ దెమ్ ట్రైబల్ మినిస్ట్రీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సినీ దర్శకుడు దిలీప్‌రాజా మాట్లాడుతూ.. సంస్థ తరపున అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గిరిజనులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



తెనాలి అర్బన్: గాంధీనగర్‌లోని షిరిడీ సాయి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఆదివారం అన్నదానం చేశారు. శ్రీ వెంకటేశ్వర యోగ కేంద్రం సభ్యులు గుర్రం మల్లికార్జునరావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు శివప్రకాశరావు కోడలు శిరీషల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. యోగా కన్వీనర్ ముద్దాబత్తుని రమణయ్య, ఆశ్రమ నిర్వాహకులు సునీత, సత్యనారాయణ, పలువురు యోగా సాధకులు పాల్గొన్నారు.

కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు బెంగుళూరులో కంప్యూటర్, ట్యాలీ నైపుణ్యంపై ఉచిత శిక్షణతో పాటు నూరు శాతం ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి హరిప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ పాస్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన 18 నుంచి 28 ఏళ్ల లోపు వయసున్న అభ్యర్థులకు బెంగళూరులో 35 రోజుల పాటు ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. ట్యాలీ ప్లస్ జీఎస్టీ, స్పోకెన్ ఇంగ్లిషు, కంప్యూటర్, కమ్యూనికేషన్, లైఫ్, ఇంటర్వ్యూ స్కిల్స్‌తో పాటు వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై అత్యుత్తమ శిక్షణ కల్పిస్తామని తెలిపారు. శిక్షణానంతరం వివిధ సంస్థల్లో నెలకు రూ.15వేలకు పైబడిన వేతనంతో నూరు శాతం ఉద్యోగాలను చూపిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 90004 87423 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వైభవంగా శ్రీలక్ష్మీనారాయణుల కల్యాణం

నగరంపాలెం: అరండల్‌పేట 4/2వ అడ్డరోడ్డులోని శ్రీఅష్టలక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో నిర్వహిస్తోన్న 30వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఆదివారం గోపూజ, గణపతి పూజతో ప్రారంభించారు. శ్రీలక్ష్మీనారాయణుల కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

తైక్వాండో క్రీడాకారులకు పతకాలు ప్రదానం



తెనాలిఅర్బన్: తైక్వాండో నేర్చుకోవడం వల్ల మనోధైర్యం పెరుగుతుందని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. అస్మిత్ ఖేలో ఇండియా తైక్వాండో సిటీ ఉమెన్స్ లీగ్ మ్యాచ్‌ని చెంచుపేట అమరావతి ఫ్లాట్స్‌లోని ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బంగారం, వెండి, కాంస్య పతకాలతోపాటు ప్రశాంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.బాలకృష్ణ, పి.సుబ్బారావు, అందె బాలచంద్రమౌళి, బట్టు నాగరాజు, షేక్ అబ్దుల్ సలాం, ఖాదర్ బాషా, వీర బసవయ్య, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్ శిక్షణకు మెరిట్ పరీక్ష

గుంటూరు ఎడ్యుకేషన్: యూపీఎస్సీ సివిల్స్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఈనెల 21,22,23వ తేదీల్లో మెరిట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పొన్నూరు రోడ్డులోని టార్గెట్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ శ్రీనివాస్ ఆదివారం తెలిపారు.

అమరజీవికి ఘన నివాళులు


బోసురోడ్డులో నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు


మారీసుపేటలోని నివాళులర్పిస్తున్న ప్రతాప్, మల్లికార్జునరావు తదితరులు

తెనాలి అర్బన్: ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాలు చిరస్మరణీయమని ఆర్యవైశ్య సంఘాల నాయకులు పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని గుంటూరు జిల్లా ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం బోసురోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం కావాలనే నినాదంతో ఆయన ఆమరణ నిరాహార దీక్ష చేశారని గుర్తు చేశారు. ఆయన త్యాగ ఫలితంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా అందరూ పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు కొప్పురావూరి హరికిషోర్, దేసు రవికుమార్, నాళం రజనీకుమార్, తెనాలి పట్టణ ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు అనిల్‌కుమార్, టి.హేమంత్, అమర్, అశోక్, వాసవీ యూత్ నాయకులు బదారీ, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

– పొట్టి శ్రీరాములు జయంతిని అమరజీవి శ్రీ పొట్టిశ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మారీసుపేటలోని ఆయన విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు తెలుగువారిలో పోరాట స్ఫూర్తిని నింపారని కొనియాడారు. కార్యక్రమంలో సాధు ప్రతాప్, ఆలపాటి శివ నరసింహారావు, మద్దె మల్లికార్జునరావు, మద్దాల రామమోహనరావు, డొంగిపర్తి సత్యనారాయణ, కోటా పున్నారావు, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ సేవ



నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారం శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో 29వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సహస్ర దీపాలంకరణ సేవను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. సుప్రభాత సేవ, స్వామికి విశేష పూజలు, నిత్యార్చన, నిత్య హోమాలు, విశేష హోమాలు, బలిహరణ కార్యక్రమాలను వేద పండితులు జరిపారు. కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు కన్నా లక్ష్మీనారాయణ, కార్యదర్శులు పాతకోట బ్రహ్మణయ్య నాయుడు, దాసరి భాస్కరరావు పర్యవేక్షించారు.

భక్తిప్రపత్తులతో తిరుపతమ్మకు పూజలు



నగరంపాలెం: కొరిటిపాడు (ఆంజనేయపేట) వాకింగ్ ట్రాక్ ఎదురుగా ఉన్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్యస్వామి ఆలయ మహోత్సవాలు ఆదివారం కొనసాగాయి. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, గోపూజ, శ్రీలక్ష్మీనారాయణ హోమం, అశ్వత్థ నారాయణ పూజను వేద పండితులు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. సాయంత్రం ఆలయ నిర్వాహకులు ముత్తయిదువులకు పసుపుకుంకుమ, గాజులు పంపిణీ చేశారు. శ్రీనగర్‌కు చెందిన అను డ్యాన్స్ అకాడమీ విద్యార్థుల భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమాలను ఆలయ నిర్వాహకులు కన్నసాని విజయకుమార్ (రాజా) రవికుమార్, బాజీ పర్యవేక్షించారు.

బిల్డింగ్ పైనుంచి పడి వ్యక్తి మృతి

పట్నంబజార్: ప్రమాదవశాత్తు బిల్డింగ్ పైనుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు అయింది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా వేమూరుకు చెందిన ఎం.దుర్గాప్రసాద్ (56) గుంటూరులోని నాజ్ సెంటర్‌లో ఉన్న ఒక లాడ్జిలో ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఒక వస్తువు తీసుకునేందుకు రెండో అంతస్తులోని పిట్టగోడ ఎక్కుతూ ప్రమాదవశాత్తు కాలు జారీ కిందపడటంతో అక్కడిక్కడే మృతి చెందాడు. లాడ్జి నిర్వాహకులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుల్లో మానసిక సమస్యలపై అవగాహన


డాక్టర్ నాగరాజకుమారిని సత్కరిస్తున్న దృశ్యం

తెనాలి: ది తెనాలి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం ఆదివారం సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ జి.నాగరాజకుమారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వయోవృద్ధులు సాధారణంగా ఎదుర్కొనే సమస్యలైన ఒంటరితనం, మతిమరపు, ఆందోళన, భయం, మానసిక కుంగుబాటు వంటి అంశాలపై మాట్లాడారు. మానసిక సమస్యలపై సభ్యుల సందేహాలకు సమాధానం ఇచ్చారు. వాటి నివారణకు తగిన సూచనలను చేశారు. సంఘం అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కార్యదర్శి కె.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పీవీ రామబాబు, కోశాధికారి పి.మల్లికార్జునరావు, సంయుక్త కార్యదర్శి ఆర్.భుజంగరావు. పి.వెంకట్ తదితర సభ్యులు పాల్గొన్నారు. ప్రసంగం అనంతరం డాక్టర్ నాగరాజకుమారిని ఘనంగా సత్కరించారు.

ఆటుపోట్లను ధైర్యంగా ఎదుర్కొన్న చాయమ్మ


చాయమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ప్రముఖులు

తెనాలి: ప్రజల కోసం పనిచేసే ఉద్యమ పోరాటాల్లో చాయమ్మలోని సద్గుణాలను స్ఫూర్తిగా తీసుకోవాలని రైతు కూలి సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ సూచించారు. ఇటీవల హైదరాబాద్‌లో గుండెపోటుతో మృతి చెందిన సీపీఐ (ఎంఎల్) పార్టీ సభ్యురాలు చాయమ్మ సంస్మరణ సభను ఆమె స్వస్థలమైన తెనాలిలో ఆదివారం నిర్వహించారు. ఎన్జీవో కళ్యాణ మండపంలో జరిగిన ఈ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు నేతలు హాజరయ్యారు. అధ్యక్షత వహించిన సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ.. చాయమ్మ జీవిత విశేషాలను తెలియజేశారు. ఆమె తండ్రి సూర్యనారాయణ ఒడిశాలోని జయపూర్‌కు చెందినవారనీ, అక్కడ గల రెండు ప్రింటింగ్ ప్రెస్సుల్లో 30 మంది వరకు గల వర్కర్లతో యూనియన్‌ను స్థాపించారని చెప్పారు. ఎంతగా పోరాడినా యాజమాన్యం స్పందించకపోవటంతో ఒడిశా ఆర్టీసీ యూనియన్ సహకారంతో అక్కడే సొంతంగా ప్రింటింగ్ ప్రెస్ పెట్టి, వర్కర్లను అన్నిరకాలుగా ఆదుకున్నట్టు చెప్పారు. సూర్యనారాయణ మరణంతో ఆయన పెద్ద కుమార్తె చాయమ్మ బాధ్యతను పార్టీ తీసుకున్నారని తెలిపారు. పార్టీ ప్రతిపాదించిన బొల్లిముంత సాంబశివరావును వివాహం చేసుకున్నట్టు తెలిపారు. అప్పట్నుంచి పార్టీ అప్పగించిన ప్రతిపనినీ నిర్వర్తించినట్టు వివరించారు. రైతుకూలి సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లిముంత సాంబశివరావు, సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర నాయకుడు భార్గవశ్రీ ప్రసంగించారు. సంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు మండవ శోభారాణి నిర్వహణలో జరిగిన ఈ సభలో జనసాహితీ నేత దివికుమార్, ప్రజాసాహితీ ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు, సీపీఐ తెనాలి కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, సీపీఎం నేతలు కొల్లిపర బాబూప్రసాద్, ములకా శివసాంబిరెడ్డి, 'ఇస్కఫ్' బొల్లిముంత కృష్ణ, నాస్తిక సమాజం నేత నండూరి నారాయణ, అరసం జిల్లా ఉపాధ్యక్షుడు కనపర్తి బెన్‌హర్, సీపీఐ (ఎంఎల్) నాయకులు కిషోర్‌బాబు, చాయమ్మ కుమార్తెలు మహిత, అనూష మాట్లాడారు. తొలుత చాయమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

'గరిమెళ్ల' లేని లోటు తీరనిది


గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్‌కు నివాళి అర్పిస్తున్న దృశ్యం

తెనాలి: అన్నమయ్య కీర్తనలను తన గానంతో ప్రజలకు చేరువ చేసిన ప్రఖ్యాత గాయకుడు, తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ ఆస్థాన గాయకుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ సంతాపసభను ఆదివారం రాత్రి తెనాలిలో నిర్వహించారు. పట్టణానికి చెందిన సంగీత సంస్థ 'సంకీర్తన' ఆధ్వర్యంలో స్థానిక హోటల్ కాన్ఫరెన్స్ హాలులో కార్యక్రమం ఏర్పాటు చేశారు. సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ పురుషోత్తమరావు మాట్లాడుతూ పదకవితా పితామహుడు అన్నమయ్య కీర్తనలను వెయ్యికి పైగా బాలకృష్ణప్రసాద్ స్వరపరచినట్టు చెప్పారు. ఆ విధంగా అన్నమయ్య కీర్తనల ప్రాచుర్యానికి ఎంతగానో కృషి చేశారని చెప్పారు. ఆయన అకాలమరణం తీరనిలోటని చెప్పారు. బాలకృష్ణప్రసాద్‌కు సంతాపంగా ఆయన స్వరపరిచిన అన్నమయ్య కీర్తనలను ఆలపిస్తూ నివాళులర్పించారు. సంగీత విద్వాంసుడు గౌరావఝుల ఆంజనేయశాస్త్రి సభకు అధ్యక్షత వహించారు. మృదంగ విద్వాంసుడు కానూరి రామకృష్ణ, టీవీఎస్ శాస్త్రి, కొండపి శ్రీనివాసరావు, కొండపి వసుంధర, అదె బాలచంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. తొలుత బాలకృష్ణప్రసాద్ చిత్రపటం వద్ద ఆయనకు నివాళిగా శ్రద్ధాంజలి ఘటించారు. సంకీర్తన కార్యదర్శి కె.రాజేశ్వరరావు పర్యవేక్షించారు.

లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా ఆందోళన

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి పిలుపు


సమావేశంలో రమాదేవి

లక్ష్మీపురం: లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరగనున్న ఆందోళనల్లో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పాత గుంటూరులోని కార్యాలయంలో కౌన్సిల్ సమావేశాన్ని జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ఎనిమిది గంటల పని విధానం, కార్మికులు అనేక త్యాగాలతో సాధించుకున్న హక్కులను సైతం హరించే విధంగా ఎన్డీఏ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చిందని తెలిపారు. రైతాంగం, కార్మికుల పోరాటాల వల్ల తాత్కాలికంగా అమలు ఆగిన, ఏప్రిల్ నుంచి లేబర్ కోడ్స్ అమల్లోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ముమ్మర ప్రయత్నం చేస్తోందని చెప్పారు. దీన్ని ఐక్యంగా కార్మిక ఉద్యమం అడ్డుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. అఖిల భారత కార్మిక సంఘాలు ఏప్రిల్ మే నెలలో లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా దశల వారి పోరాటం, జాతీయ సార్వత్రిక సమ్మెను జరిపేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నారని ఆమె వెల్లడించారు. ఇది జిల్లాలో విస్తృతంగా కార్మిక వర్గంలోకి వెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె చెప్పారు. లేబర్ కోడ్స్ అమలయితే కార్మికులు హక్కుల్ని కోల్పోతారని తెలిపారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. నేతాజీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పీ ఫోర్ పేరుతో ప్రైవేటీకరణ విధానాలను ప్రజలపై తీవ్రతరం చేసేందుకు ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. విశాఖ ఉక్కుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వైఖరిని బట్టబయలు చేయాలని కోరారు. ప్రభుత్వ రంగ పరిరక్షణ కోసం ఐక్య పోరాటాలు నిర్వహణకు సిద్ధంకావాలని ఆయన పిలుపునిచ్చారు.

విద్యార్థుల అభివృద్ధికి గురువులే కేంద్ర బిందువులు

సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్ లావణ్యాదేవి


ప్రతిభావంతులైన విద్యార్థులతో లావణ్యాదేవి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల అభివృద్ధికి కేంద్ర బిందువులు గురువులేనని సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్ బి.లావణ్యాదేవి పేర్కొన్నారు. కెనడీ విద్యాసంస్థల 44వ వార్షికోత్సవాన్ని ఆదివారం మార్కెట్ సెంటర్లోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లావణ్యాదేవి మాట్లాడుతూ విద్యార్థి దశలో సత్ప్రవర్తన, క్రమశిక్షణ కలిగిన వారు భావి జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకుంటారని తెలి పారు. ఈ సందర్భంగా గతేడాది టెన్త్ ఫలితా ల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగ దు బహుమతి, ప్రశంసాపత్రాలు అందజేశారు. చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు డాక్టర్ మాకినేని హేమంత్, కెనడీ విద్యాసంస్థల వ్యవస్థాపకురాలు సావిత్రి, డైరెక్టర్లు కె. శ్రీకాంత్‌బాబు, డాక్టర్ కె.శ్రీవిద్య బహుమతులు, ప్రశంసాపత్రాలు బహూకరించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో నెక్స్‌జెన్ కిడ్స్, గ్లోబల్ కిండర్ గార్డెన్, నెక్స్‌జెన్ మెరిట్ క్యాంపస్‌ల ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పట్టాభిపురం సీఐగా మధుసూదనరావు

నగరంపాలెం: పశ్చిమ సబ్ డివిజన్‌లోని పట్టాభిపురం పోలీస్ స్టేషన్ సీఐగా వీఆర్‌లో ఉన్న మధుసూదనరావు నియమితులయ్యారు. ఈ మేరకు గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. మధుసూదనరావు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత సీఐ వీరేంద్రబాబుని సీసీఎస్‌కు పంపించారు.

పోలీస్ శాఖకు డ్రోన్ కెమెరా అందజేత



నగరంపాలెం: జిల్లా పోలీస్ విభాగానికి ఉప్పుటూరి చిన్నరాములు సేవా ట్రస్ట్ తరఫున వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట గ్రామవాసి ఉప్పుటూరి చిన్నరాములు డ్రోన్ కెమెరాను ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కు అందించారు. చిన్నరాములును ఆయన సత్కరించారు. సామాజిక బాధ్యత, సేవా దృక్పథంతో కెమెరాను అందించడం అభినందనీయమని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. అనంతరం డ్రోన్ కెమెరాను వట్టిచెరుకూరు పీఎస్ సీఐ రామానాయక్‌కు ఎస్పీ అప్పగించారు.

పేదలకు బియ్యం, పింఛన్ల పంపిణీ


బియ్యం పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

నగరంపాలెం: సమాజంలో దివ్యాంగులు, వృద్ధులను ఆదుకునేందుకు సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని ఆర్యవైశ్య అఫీషియల్ అండ్ ప్రొఫిషనల్ అసోసియేషన్ (అవోపా) రాష్ట్ర అధ్యక్షులు తడవర్తి రాంబాబు కొనియాడారు. అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆదివారం ఆర్.అగ్రహారం శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం ఎదురున్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వాసవీ క్లబ్ గుంటూరు, మహిళా, యువ క్లబ్స్ సంయుక్తంగా 108 మందికి ఉచితంగా బియ్యం, పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఇటువంటి సేవా కార్యక్రమాలతో పేదలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. రానున్న రోజుల్లో మరెన్నో కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దాత ఆతుకూరి నరసింహారావు పాల్గొన్నారు.